



	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	36	22
భద్రాద్రి కొత్తగూడెం	37	24





సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ సభలో నాయకుల అభివాదం

ఏకమై కదులుదాం

- సంఘటితంగా ఉద్యమిద్దాం
- విప్లవ పార్టీలన్నింటినీ ఏకం చేయడమే మాస్‌లైన్ లక్ష్యం
- విప్లవోద్యమంలో గత తప్పిందాలను సవరించుకుంటాం
- మోదీ, ఆర్‌ఎస్‌ఎస్ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు కదిలిరావాలి
- ఖమ్మంలో సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ యూనిటీ సభలో నేతల పిలుపు
- దేశ విదేశాలనుంచి హాజరైన ప్రతినిధులు
- నేడు భక్తరామదాసు కళాక్షేత్రంలో ప్రతినిధుల సభ

ఖమ్మం, మార్చి 3(ఆంధ్రజ్యోతిప్రతినిధి): దేశంలో ప్రజాసమస్యలపై పోరాడే విప్లవ పార్టీలన్నింటినీ ఏకం చేసి సంఘటితంగా పోరాటాలు సాగించడమే సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్(ప్రజాపంథా) ప్రధాన లక్ష్యమని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ పార్టీ నేతలు తెలిపారు. ఈ ఉద్యమంలో విప్లవ కమ్యూనిస్టు పార్టీల నాయకులు, ప్రజలు, కార్మికులు, కర్షకులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ (ప్రజాపంథా) యూనిటీ మహాసభలు ఖమ్మంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ జాతీయ మహాసభల్లో భాగంగా మంగళవారం సాయంత్రం ఖమ్మం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించి రాత్రి పెవిలియన్‌గ్రౌండ్‌లో బహిరంగ నిర్వహించారు. ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు కెచ్చల రంగయ్య అధ్యక్షతన జరిగిన సభలో పలు రాష్టాలనుంచి తరలివచ్చిన నాయకులు ప్రసంగించారు. సభలో ముందుగా సీపీఐఎంఎల్ ఆర్ఐ జాతీయ కార్యదర్శి ప్రతీప్‌సింగ్‌ఠాగూర్ మాట్లాడుతూ ఖమ్మంలో జరుగుతున్న మాస్‌లైన్ బహిరంగ సభ ఒక చారిత్రాత్మక ఘటన అన్నారు. ఇది భవిష్యత్ విప్లవోద్యమాలకు, విప్లవ పార్టీల ఐక్యతకు తొలి అడుగుని పేర్కొన్నారు. విప్లవోద్యమంలో గతంలో అనేక తప్పుడు నిర్ణయాలు జరిగాయని, ఫలితంగా కమ్యూనిస్టు పార్టీల్లో చీలికలు వచ్చాయన్నారు. ఎనో త్యాగాలు, పోరాటాలు సాగించిన వారి ఆశయాలను సాధించేందుకు విప్లవోద్యమ చరిత్రలో జరిగిన తప్పులను సరిదిద్దుకుని ముందుకు సాగే లక్ష్యంతో సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ (ప్రజాపంథా) పార్టీ ఆవిర్భవించిందన్నారు. తమతో కలిసి వచ్చే విప్లవోద్యమ పార్టీలను కలుపుకుని ముందుకు సాగుతామన్నారు. దేశంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ పాలనలో ప్రధాని నరేంద్రమోదీ విధానాలు ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేసేలా ఉన్నాయన్నారు. హిందుత్వవాదాన్ని మోదీ, అమిత్‌షాలు ప్రజలపై బలవంతంగా రుద్దుతున్నారని ఆరోపించారు. దేశంలో ఆదివాసీలు, రైతులు, కార్మికులు, జర్నలిస్టులు, మేధావులు తమ సమస్యలు చెప్పుకునే పరిస్థితి లేదన్నారు. జాతీయస్థాయిలో బీజేపీకి ఇండియా కూటమి ప్రత్యామ్నాయం అని చెప్పుకుంటున్నా అది బూర్జువా పార్టీల కూటమిగా రాజకీయ స్వప్రయోజనాల కోసమే ఏర్పడిందే తప్ప ప్రజల కోసం కాదని విమర్శించారు. దేశంలోని ఇతర విప్లవ పార్టీలను కూడా కలుపుకొని అతిపెద్ద కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటుచేసి ప్రజాపోరాటాలు సాగించడమే ఖమ్మం సభ ఉద్దేశమన్నారు. దేశంలో నక్సలిజం లేదని చెబుతున్నా ప్రజల కోసమే నక్సలైట్లు పోరాడుతూనే ఉన్నారన్నారు.

మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగానే 'మాస్‌లైన్' ఏర్పాటు

సీపీఐఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ మతోన్మాద పాలక విధానాలకు వ్యతిరేకంగా మాస్‌లైన్ పార్టీ అవతరించిందన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం లేదని, రైతులు, గిరిజనులు, నిరుద్యోగులు, మహిళలపై పాలక ప్రభుత్వాలు వివక్ష చూపిస్తున్నాయన్నారు. ప్రజలందరిని కలుపుకుని కదంతొక్కి ఉద్యమించి తీరుతామన్నారు. 'రామరాజ్యం' పేరుతో అరాచక రాజ్యాన్ని, హింసాత్మక పాలనను నడిపిస్తున్నారని ఆరోపించారు. రామరాజ్యం అంటే అన్నివర్గాల వారు సుఖసంతోషాలతో ఉండాలన్న విషయం ప్రధాని మోదీ గుర్తించాలన్నారు. విదేశాలకు వెళ్లి అక్కడ జరిగే యుద్ధాల పట్ల స్పందించే మోదీ మణిపూర్‌లో ఆదివాసీలపై జరుగుతున్న అరాచకాలపై ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. తెలంగాణలో అనేక పోరాటాల ఫలితంగా ప్రజాస్వామ్య రాష్ట్రం వస్తుందని ఆశిస్తే కేసీఆర్ సారథ్యంలో నిజాంపాలన గుర్తు చేసేలా గత పదేళ్ల పాలన సాగిందన్నారు. కేసీఆర్ పాపాలను చూసి ప్రజలు చేసిన తిరుగుబాటుకు నిదర్శనంగానే కాంగ్రెస్ విజయం సాధించిందన్నారు. ఇది కాంగ్రెస్ గెలుపు కానేకాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలే కాకుండా రూ.2లక్షల రైతు రుణమాఫీ చేయాలన్నారు. ఈ సభలో పీసీసీ సీపీఐఎంఎల్ కార్యదర్శి సుభాష్‌దేవ్‌తో పాటు సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ (ప్రజాపంథా) నాయకులు సంజయ్‌సంగ్వీ, దినేష్‌గోహయ్, కేజీ రాంచందర్, కె.రమ, రాయల చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య తదితరులు ప్రసంగించారు. ఈ బహిరంగ సభలో ఆ పార్టీకి చెందిన పలు రాష్ట్రనాయకులు పూజారి, జీవకుమార్, రవిబాబు, ప్రవీన్, నట్వర్, భాస్కరరావు, బీమల్ త్రివేది, అల్లిక్ చక్రవర్తితోపాటు పలువురు ఇతర దేశాలకు చెందిన ప్రతినిధులు కూడా హాజరయ్యారు.


పోటు రంగారావు




ప్రతీప్‌సింగ్‌ఠాగూర్

కదం తొక్కిన ఎర్రసైన్యం

14రాష్ట్రాల కార్మిక, కర్షక, సంఘాల గ్రేట్‌మార్చ్

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 3: 14రాష్ట్రాల కార్మిక, కర్షక, రైతు, కూలీ సంఘాలు ఐక్యమై ఖమ్మం నగరంలోని ప్రధాన రహదారిపై కథం తొక్కాయి. మూడు విప్లవ సంస్థలకు అనుబంధంగా ఉండే ప్రజాసంఘాలు, ఆయా పార్టీల నాయకులు ఎర్రటి దస్తులు ధరించి ఖమ్మం వీధులు ఎరుపెక్కేలా గ్రేట్‌మార్చ్ ప్రదర్శన నిర్వహించారు. తెలంగాణ, ఏపీ, త్రిపుర, అస్సాం, పశ్చిమబెంగాల్, ఒడిశా, కర్నాటక, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చిన 100 ఆరుణోదయ కళాకారులు నృత్యాలు చేశారు. 100మంది డప్పు కళాకారులు ప్రదర్శన చేశారు. మరో 500మంది మహిళలతో కోలాటమాడారు. ఆరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు హజ్మీర బిచ్చా, కార్యదర్శి కృష్ణ, గద్దల లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులను గ్రేట్‌మార్చ్ ప్రదర్శనలో సమన్వయం చేసి ప్రదర్శనలో రాష్ట్రాల వారీగా ఏర్పాట్లు చేశారు. ప్రదర్శన అగ్రభాగాన ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, సీపీఐ(ఎంఎల్)ఆర్ఐ ఆలిండాయ కార్యదర్శి ప్రదీప్‌సింగ్‌ఠాగూర్, పీసీసీ సీపీఐ(ఎంఎల్) కేంద్ర కార్యదర్శి సుభాష్‌దేవ్, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, పీయూసీఐ ఆలిండియా కార్యదర్శి సంజయ్‌సింగ్, రమా, చంద్ర ఆరుణ, రాయల చంద్రశేఖర్, కే. సూర్యం, ఎస్ఎల్ పద్మ, వీ. కృష్ణ, గోకినపల్లి వెంకటేశ్వరరావు, కెచ్చల రంగయ్య, చిన్న చంద్రన్న నడిచారు. ఖమ్మం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నుంచి పెవిలియన్ మైదానం వరకు వేలాది మందితో ఈ ప్రదర్శన సాగింది.

11న భద్రాద్రికి సీఎం రేవంత్‌రెడ్డి?



- దేవస్థానంలో రామయ్య దర్శనం
- ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం, బహిరంగసభ

ఖమ్మం, మార్చి 3 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలిసారి భద్రాద్రి జిల్లా పర్యటనకు రాబోతున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం 11వ తేదీన భద్రాద్రి జిల్లాలో రేవంత్‌రెడ్డి పర్యటన ఉండే అవకాశం ఉంది. ఈ సందర్భంగా ఆయన భద్రాచలం సీతారామచంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించి విలేకరుల సమావేశం నిర్వహిస్తారు. ఆ తర్వాత పినపాక నియోజకవర్గంలోని బూర్గంపాడు వద్ద రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టి అక్కడే బహిరంగసభ కూడా నిర్వహిస్తారు. అయితే సీఎం పర్యటన ఉమ్మడి జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోనూ ఉండే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించిన పూర్తి కార్యక్రమాలను అధికారయంత్రాంగం రూపకల్పన చేస్తున్నట్లు సమాచారం. ఒకటి, రెండు రోజుల్లో సీఎం పర్యటనపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

నిరుద్యోగుల్లో ధైర్యాన్ని నింపుతాం

మధిర రూరల్/ఎర్రుపాలెం, మార్చి 3: నీళ్లు, నిధులు, నియామకాల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేరలేదని, ఏళ్ల తరబడి ఉద్యోగాలకోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మనోధైర్యాన్ని నింపుతోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు. ఆదివారం మధిర నియోజకవర్గంలో పర్యటించిన ఆయన మధిర, ఎర్రుపాలెం మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. మధిర మండలంలోని రొంపిమళ్ల, జాలిముడి గ్రామాల్లో రొంపిమళ్ల-ఎండపల్లి మధ్య రూ.2.80కోట్లతో నిర్మించనున్న బీటీరోడ్డుకు అలాగే జాలిముడి మెయిన్‌రోడ్డు నుంచి ప్రాజెక్టు వరకు రూ.52లక్షలతో నిర్మించనున్న బీటీరోడ్డు పనులకు భట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాటకోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటుచేస్తామన్నారు. మధిర మండలం ఎండపల్లిలో పారిశ్రామిక వాడ ఏర్పాటుచేస్తామని, జాలిముడి ప్రాజెక్టు ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసి తీరుతామన్నారు. త్వరలోనే ఎండపల్లి పారిశ్రామికవాడకు భూమిపూజ చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ఈ రామచంద్రమౌళి, ఏఈ ప్రదీప్‌కుమార్, డీసీసీబీ ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ఎంపీపీ మెండెం లలిత, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, పలుశాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు సూరంశెట్టి కిషోర్, గొల్లమందల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం మండలంలోని అయ్యవారిగూడెంలో రూ.6.50కోట్లతో బీటీరోడ్డుకు, భీమవరం నుంచి గోసవీడు గ్రామానికి రూ.16కోట్లతో ఫ్లైఓవర్ బిడ్జి, భవానిపురం నుంచి కాచవరం వరకు రూ.16కోట్లతో బీటీరోడ్డుకు భట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భీమవరంలో మాట్లాడుతూ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై పెట్టుకున్న ఆశలు నెరవేర్చి తీరుతామన్నారు. నిరుద్యోగుల్లో ధైర్యాన్ని నింపుతామన్నారు. ఆర్థికలోటుతో బాధ్యతలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం క్రమంగా ఆర్థిక ఇబ్బందులను అధిగమించి ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదీనే వేతనాలు చెల్లించి వారి గౌరవాన్ని కాపాడుతున్నామన్నారు. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలను చేర్చటంలోనూ ప్రభుత్వ ఉద్యోగులు నిబద్ధతలో పనిచేసి సర్కార్‌గౌరవాన్ని కాపాడాలని సూచించారు. ఉద్యోగ నియామకాల కోసం టీఎస్పీఎస్సీ ప్రక్షళన చేశామని, గడిచిన మూడు నెలల్లో 25వేల ప్రభుత్వ కొలువులిచ్చిమన్నారు. నిరుద్యోగుల విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, వారికి భరోసా కల్పిస్తామన్నారు. పేద, మధ్యతరగతి, నిరుద్యోగ యువతీ యువకుల కోసం ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో నాలెడ్జ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎంపీపీ శిరీష, జడ్పీటీసీ కవిత, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వర రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్ష కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

- ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో నాలెడ్జ్ సెంటర్
- ప్రభుత్వ ఉద్యోగుల గౌరవాన్ని కాపాడుతాం
- రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
- 'మధిర' పర్యటనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క


రొంపిమళ్ల సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క


భక్తులకు మజ్జిగ అందజేస్తున్న దేవస్థానం ఈవో

భద్రాద్రి దేవస్థానంలో మజ్జిగ ఉచిత పంపిణీ

ప్రారంభించిన భద్రాద్రి దేవస్థానం ఈవో రమాదేవి

భద్రాచలం, మార్చి 3: వేసవి రాకముందే ఎండలు తారాస్థాయికి చేరుతుండటంతో సుదూర ప్రాంతాలనుంచి వచ్చే భక్తులకు ఎండవేడిమి నుంచి ఉపశమనం కలిగించేందుకు భద్రాద్రి దేవస్థానంలో మజ్జిగ ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన మజ్జిగ ఉచిత పంపిణీ కేంద్రాన్ని ఆదివారం దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. క్యూలైన్లలో రామయ్యను దర్శించుకునేందుకు వచ్చే భక్తులతోపాటు ఇతరులకు సైతం ఇక్కడ మజ్జిగను పంపిణీ చేయనున్నారు. వేసవినేపథ్యంలో రాబోయే మూడు నెలలు భక్తులకు మజ్జిగను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు ఈవో తెలిపారు. సోమవరం నుంచి శుక్రవారంవరకు రోజూ 75లీటర్ల పెరుగు, శని, ఆదివారాల్లో 100 లీటర్ల పెరుగును ఇందుకు వినియోగించనున్నారు. ఉచిత మజ్జిగతోపాటు ఆలయ ప్రాంగణం, పరిసరాల్లో ఎండతో భక్తులు ఇబ్బందులు పడకుండా కూల్ పెయింట్‌ను సైతం వేయించారు. కార్యక్రమంలో దేవస్థానం ఏఈవో శ్రవణ్‌కుమార్, ఇంజనీరింగ్ విభాగం ఈఈ వి.రవీంద్రనాథ్, పర్యవేక్షకుడు లింగాల సాయిబాబా, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, వేద పండితులు ద్వివేదుల సత్యసాయి సన్యాసిశర్మ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌లోని మణికొండకు చెందిన గోపినాదరావు, ఖమ్మం జిల్లా మధిరకు చెందిన వి.దుర్గాప్రసాద్ అరుణ దంపతులు చేరో రూ.లక్ష విరాళంగా అందజేశారు.

శ్రీరామగిరిలో రామయ్య కళ్యాణం

ధర్మ ప్రచారంలో భాగంగా ఏపీలోని అల్లూరి జిల్లా వరరామచంద్రాపురం మండలంలోని శ్రీరామగిరిలో భద్రాద్రి రామయ్యకు కల్యాణం నిర్వహించారు.

పోలియోరహిత సమాజాన్ని నిర్మిద్దాం

- తల్లిదండ్రులు బాధ్యతగా తమ పిల్లలకు చుక్కలు వేయించాలి
- ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు వీపీ గౌతమ్, డాక్టర్ ప్రియాంక
- ఇరు జిల్లాల్లో పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభం

ఖమ్మం కలెక్టరేట్/కొత్తగూడెం(ఆంధ్రజ్యోతి), మార్చి 03: పోలియోరహిత సమాజాన్ని నిర్మాద్దామని ఖమ్మం, భద్రాద్రి జిల్లా కలెక్టర్లు వీపీ గౌతమ్, డాక్టర్ ప్రియాంక పిలుపునిచ్చారు. పుట్టిన బిడ్డ మొదలుకొని ఐదు సంవత్సరాల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలని వారు కోరారు. ఇరు జిల్లాల్లో ఆదివారం 'పల్స్‌పోలియో' కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఖమ్మం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన కేంద్రంలో కలెక్టర్ వీపీ. గౌతమ్ చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్స్ పోలియోలో కార్యక్రమంలో భాగంగా 0-5 ఏళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు ఇతర ప్రాంతాలలో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1.30 లక్షల మంది చిన్నారులను గుర్తించగా అర్హులైన చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేసేందుకు వైద్యఆరోగ్య, సంక్షేమ, మున్సిపాలిటీ ఇతర శాఖల సిబ్బందిని నియమించామన్నారు. ఆదివారం చుక్కల మందు వేయించని చిన్నారుల తల్లిదండ్రులు సోమవారం, మంగళవారం సిబ్బంది ఇంటింటికీ వచ్చినప్పుడు తప్పనిసరిగా తమ పిల్లలకు చుక్కలు వేయించాలని తెలిపారు. వైద్యారోగ్యశాఖతో పాటు ఐసీడీఎస్, విద్యా, పురపాలకశాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమ అధికారి డాక్టర్ ప్రమీల, డాక్టర్ లక్ష్మిలోహిత, ఆరోగ్య పర్యవేక్షకులు తాళ్లూరి శ్రీకాంత్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రియాంక

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం ప్రారంభమైంది. జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో ఆదివారం పాల్వంచ మండలం శేఖరంబంజర పీహెచ్‌సీలో కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలియోరహిత సమసమాజ స్థాపనకు తల్లిదండ్రులు 0-5 సంవత్సరాల చిన్నారులకు తప్పని సరిగా పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. జిల్లాలో 97,572మంది చిన్నారులను గుర్తించామని వారందరికీ పోలియోచుక్కలు అందేలా చేస్తామన్నారు. ఆదివారం చుక్కలు వేయిచలేకపోయినవారు సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ వచ్చే సిబ్బందితో తప్పనిసరిగా తమ పిల్లలకు చుక్కలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జేవీఎల్. శిరీష, డాక్టర్లు బాలాజీనాయక్, కృష్ణకుమారి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

పాలేరు జేఎన్‌టీయూకు బాలారిష్టాలు

- గతేడాది మద్దులపల్లి వద్ద ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ ప్రారంభం
- ఇంకా తాత్కాలిక వసతులతోనే నిర్వహణ
- విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్ కూడా కరువు 5
- శాశ్వత వసతులపై దృష్టి పెట్టని ప్రభుత్వం

నేటి నుంచి ఇంటర్ స్పాట్

- తొలిసారి భద్రాద్రి జిల్లాలో ఏర్పాటు 5

తాలిపేరుకు సెన్సార్లు

- ప్రాజెక్టుకు అత్యాధునిక టెక్నాలజీ
- వరదలొస్తే అప్రమత్తం చేయనున్న ఉపకరణాలు 5


ముత్యాలమ్మ చెరువులో జనజాతర

మత్స్య జాతర

చేపలు పట్టేందుకు వందలాదిగా కదిలిన ఏజెన్సీ వాసులు

కరకగూడెం, మార్చి 3: కరకగూడెం మండలంలోని చిరుమళ్ల పంచాయితీ పరిధిలోని ముత్యాలమ్మ చెరువులో ఆదివారం జనసందడి కనిపించింది. మండలంలోని అనంతారం, పద్మాపురం, కరకగూడెం, తాటిగూడెం, చిరుమళ్ళ, గొళ్లగూడెం, కొత్తగూడెం, కొత్తూరు, చొప్పాల గ్రామాలతో పాటు పరిసర ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో ఇక్కడ చెరువులో చేపలు పట్టేందుకు రావడంతో మత్స్య జాతరను తలపించింది. కరకగూడెం మండలం పూర్తి ఏజెన్సీ ప్రాంతం అవడం.. వ్యవసాయ భూములు ఎక్కువగా ఉండటంతో.. ఇక్కడ పలు గ్రామాలలో పదుల సంఖ్యలో పలు చెరువులు ఉన్నాయి. ఇక్కడ చెరువులలో నీరు తగ్గుతుండటంతో ప్రతీ సంవత్సరం ఫిబ్రవరి, మార్చి నెలలో ఇక్కడ చేపలు పడుతుంటారు. మండలంలో ఏ గ్రామంలోనైనా చేపల చెరువు పడుతున్నారంటే పలు గ్రామాలకు సమాచారం ఇస్తారు. చేపలు పట్టే రోజున ఆయా గ్రామాల ప్రజలు ఆ చెరువులో చేపలను పట్టేందుకు ఆటోలో, బైక్‌లపై, కాలినడక అక్కడకు చేరుకుంటారు. ఆదివారం ముత్యాలమ్మ చెరువులో చేపలను పట్టేందుకు పలు గ్రామాల నుంచి ఇక్కడకు ప్రజలు రావడంతో జనజాతరగా కనిపించింది.

సూరంపల్లిని పరామర్శించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కొణిజర్ల, మార్చి3: కొణిజర్ల తాజా, మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నేత సూరంపల్లి రామారావుపై హత్యాయత్నం జరిగిన విషయం తెలిసిందే. రామారావును ఖమ్మం నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఆదివారం సూరంపల్లిని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులతో మాట్లాడారు.


సూరంపల్లిని పరామర్శిస్తున్న తుమ్మల

ఆదివాసీలను విస్మరించడం శోచనీయం

● ఆదివాసీ అఖిలపక్ష ప్రజాసంఘాల జేఏసీ నాయకులు

భద్రాచలం మార్చి 3: మహబూబాబాద్ లోక్‌సభ స్థానంలో రాజకీయ పార్టీలు ఆదివాసీలను విస్మరించడం శోచనీయమని ఆదివాసి ప్రజాసంఘాల జేఏసీ నాయకులు పేర్కొన్నారు. భద్రాచలంలో ఆదివారం సుందరయ్య కాలనీలో జాతీయ ఆదివాసీ అఖిలపక్ష ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మహబూబాబాద్ పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ మహబూబాబాద్ పార్లమెంటు ఏర్పడిన దగ్గర నుంచి ఎంపీ అభ్యర్థిగా వలస వచ్చిన లంబాడీలకే ప్రాధాన్యత ఇస్తున్నందున్నారన్నారు. అసలైన గిరిజనులు, ఆదివాసీలకు అన్యాయం చేసిన పార్టీలకు రాబోవు పార్లమెంట్ ఎన్నికలలో తగిన బుద్ధి చెప్తామని స్పష్టం చేశారు. మహబూబాబాద్ పార్లమెంట్‌లో 12.5 లక్షల జనాబా ఉండగా ఆదివాసీలు 3.75 లక్షలు ఉన్నారని, లంబాడీలు 2.5 లక్షలు ఉన్నారని పేర్కొన్నారు. మెజార్టీ ఉన్న ఆదివాసీలను అన్ని రాజకీయ పార్టీలు విస్మరించడం అనేది లంబాడీల కార్పొరేట్ శక్తులకు పెద్దపీట వేస్తున్నాయని ఎద్దేవా చేశారు. జీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ అధ్యక్షతన జరిగీన సమావేశంలో జాతీయ కన్వీనర్ మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర, ఆదివాసీ సంఘాల అడ్వైజర్ పొడుగు శ్రీనాథ్, తుడుం దెబ్బ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం నారాయణ దొర,


సమావేశంలో మాట్లాడుతున్న చందా లింగయ్య

ఆదివాసీ పొలిటికల్ జేఏసీ కన్వీనర్ వాసం రామకృష్ణ దొర, ఆదివాసీ రాష్ట్ర సీనియర్ నాయకులు చిచ్చొడి శ్రీరామ్మూర్తి, సున్నం లక్ష్మయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు కుంజా శీను, గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షుడు వజ్జ నరసింహారావు, గొగ్గెల రామకృష్ణ, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు వర్సా శ్రీనివాసరావు, కొమరం సైదులు, ఆదివాసీ నాయకులు సోయం సుక్రాం, మర్మం చిట్టిబాబు, పాల్వంచ వెంకటేశ్వర్లు, సోడే వీరాస్వామి, ఉద్యోగ ఉద్యోగ సంఘ రాష్ట్ర నాయకులు ముక్తి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు ప్రయోజనాలను కాపాడుతా

●డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు


డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న నాయకులు

మధిర, మార్చి 3: రైతుల ప్రయోజనాలను కాపాడుతూ, సెంట్రల్‌బ్యాంక్‌ను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. బ్యాంక్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మధిర రిక్రియేషన్‌క్లబ్ ఆధ్వర్యంలో డీసీసీబీ చైర్మన్‌కు సన్మానం కార్యక్రమం నిర్వహించారు. బ్యాంక్ చైర్మన్‌గా పదవీ రావడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని రైతులకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపడతామన్నారు. ఖమ్మం సెంట్రల్ బ్యాంక్ నాలుగు జిల్లాల పరిధిలో ఉందన్నారు. ఇప్పటి వరకు తాను చేపట్టిన ప్రతి పని ప్రజల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొనే చేశానని తెలిపారు. రైతుల సంక్షేమంతో పాటు డీసీసీబీని అభివృద్ధి చేసి మధిరకు కీర్తి తీసుకొస్తానని తెలిపారు. తొలుత పలువురు మాట్లాడుతూ దొండపాటి ప్రజాప్రతినిధిగా ఏపదవీలో ఉన్నా నిబద్ధతో పనిచేసి ఆపదవికి వన్నెతెచ్చారని, అదే రీతిలో సెంట్రల్ బ్యాంక్‌ను అభివృద్ధి చేసి రైతులకు సేవచేయాలని కోరారు. ఈసందర్భంగా దొండపాటిని పలువురు ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మునిసిపల్ కౌన్సిలర్ కట్టా గాంధీ, ములకలపల్లి మోహన్‌రావు, సత్యనారాయణ, నాగేశ్వరరావు, చావా రామకృష్ణ, కొంకా రమేష్, కృష్ణారావు, అన్నె మోహన్‌రావు, గడ్డం రమేష్, కటకం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో విద్యార్థుల ఎంపిక 5న

పాల్వంచ రూరల్, మార్చి 3: ఐటీడీఏ భద్రాచలం పరిధిలోని ఉమ్మడి జిల్లా గిరిజన క్రీడా పాఠశాలలో 5వ తరగతి ప్రవేశాలకు ఈ నెల 5, 6 తేదీల్లో కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్‌లో ఎంపికలు జరుగనున్నట్లు జిల్లా క్రీడల అధికారి బొల్లి గోపాలరావు, సహాయ క్రీడల అధికారి కొమరం వెంకటనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుపుతున్న గిరిజన క్రీడా పాఠశాలలైన కిన్నెరసాని బాలుర, కాచనపల్లి బాలికల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశాల కోసం ఈ నెల 5, 6 తేదీల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల గిరిజన బాల, బాలికలు కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగే ఎంపికల్లో పాల్గొనాలని సూచించారు. క్రీడాకారులు 4వ తరగతి చదువుతూ ఉండి, 8 ఆగస్టు 2024 నాటికి 9 నుంచి 11 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలి. విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్స్, ఆధార్‌కార్డు, ఫొటో వెంట తీసుకొని రావాలని సూచించారు. కిన్నెరసాని బాలుర క్రీడా పాఠశాలలో 40, కాచనపల్లి బాలికల క్రీడా పాఠశాలలో 40, వాటర్ స్పోర్ట్స్ అకాడమీ బోవన్‌పల్లి, హైద్రాబాద్‌లో కో ఎడ్యుకేషన్‌లో బాలికలు 20, బాలురు 20 సీట్లు ఉన్నట్లు తెలిపారు. క్రీడాకారులను 9 రకాల బ్యాటరీ టెస్టుల ద్వారా ఎంపిక చేస్తామని అన్నారు.

‘జీవ వైవిద్యాన్ని కాపాడాలి’

కల్లూరు, మార్చి 3: జీవ వైవిద్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఖమ్మం రోటరి క్లబ్ సభ్యుడు, గ్రీన్‌వారియర్ జెవీఎస్ చంద్రశేఖర్ విద్యార్థులకు హితవు చెప్పారు. ప్రపంచ వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా స్థానిక సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన వన్యప్రాణుల సంరక్షణ సదస్సులో ఆయన ప్రసంగించారు. అడవులు, వన్యప్రాణులను రక్షించినప్పుడే జీవవైవిద్యాన్ని కాపాడిన వారవుతామన్నారు. సృష్టిలో ఉన్న ప్రతి ప్రాణికి జీవించే హక్కు ఉందని అన్నారు. ప్రకృతిలో అనేక జీవరాశులు ఉన్నాయని, అందులో మనిషి ఒక భాగమన్నారు. పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ లక్ష్యంతోనే ప్రజల్లో చైతన్యం కల్పించే క్రమంలో చంద్రశేఖర్ ముద్రించిన కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులున్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న చంద్రశేఖర్

విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలి

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 3: ఎస్సీ హాస్టల్ విద్యార్థులు అన్ని రంగాల ప్రతిభలో ముందుండాలని డీడీ కస్తాల సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ సాంఘిక సంక్షేమశాఖ బాలుర(బీ) వసతి గృహం విద్యార్థులు హాస్టల్ డే నిర్వహించారు. విద్యార్థులతో పాటుగా వచ్చిన తల్లిదండ్రులు ఆలోచించే విధంగా రైతాంగ సమస్యలు, వ్యవసాయంలో వచ్చే ఆటుపోట్లు, దేశ రక్షణలో సైనికుల వీరోచిత విన్యాసాలను పాటలు, ప్రదర్శనల రూపంలో నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూ శ్రీలత, సంక్షేమాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోటపాడు రుక్మారావు, సంక్షేమాధికారులు విజయ, విజయలక్ష్మి, పాల్గొన్నారు.


సంక్షేమశాఖ ద్వారా అందిస్తున్న 13 రకాల సౌకర్యాలపై ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు


రైతుల గోడుపై ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

స్వల్పంగా పెరిగిన పామాయిల్ గెలల ధర

అశ్వారావుపేట రూరల్, మార్చి 3: పామాయిల్ గెలల ధర స్వల్పంగా పెరిగింది. జనవరిలో పామాయిల్ గెలల టన్ను ధర రూ.12,595 ఉండగా, ఫిబ్రవరి నెలలో రూ.450 పెరిగింది. దీంతో పామాయిల్ గెలల ధర రూ.13,045గా నిర్ణయించారు. ఈమేరకు ఆయిల్‌ఫెడ్ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

పేకాట స్థావరంపై దాడి.. నలుగురి అరెస్టు

సత్తుపల్లిరూరల్, మార్చి3: పట్టణ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. పట్టణ సీఐ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి సత్తుపల్లి పట్టణ శివారులో సమాచారం మేరకు పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఉండవల్లి విద్యాసాగర్, చల్లగుండ్ల రవి, గడ్డం వెంకటేశ్వరరావు, మిద్దె ముత్తయ్యలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.53,100 నగదు, మూడు సెల్‌ఫోన్లు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నలుగురుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కోడిపందేల స్థావరంపై ...

దుమ్ముగూడెం మార్చి 3: మండల సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం వంకమడుగు అటవీప్రాంతంలోని కోడిపందేల స్థావరంపై ఛత్తీస్‌గఢ్ పోలీసులు ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఛత్తీస్‌గఢ్ వాసులతోపాటు దుమ్ముగూడెం మండల, చుట్టు ప్రక్కల మండలాల నుంచి కోడిపందేలు ఆడేందుకు వెళ్లి పోలీసులకు దొరికినట్లు తెలుస్తోంది. పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాలు సైతం పట్టుబడినట్లు సమాచారం. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం మారాయిగూడెం స్టేషన్ పోలీసులు దాడులు చేసినట్లు తెలుస్తోంది.

కొణిజర్లలో ప్రొటోకాల్ రగడ

కొణిజర్ల, మార్చి3: కొణిజర్లలో ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కలు విషయంలో జడ్పీచైర్మన్ హాజరై స్థానిక ప్రజాప్రతినిధులు రాకపోవడంపై స్థానిక గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు భగ్గుమన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. స్థానికంగా ఉన్న ఇద్దరు ఎంపీటీసీలను ఎందుకు విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తహసీల్దార్ హాస్సేన్, ఎంపీడీవో రోజారాణి, ఎస్ఐ శంకర్‌రావు ఆందోళనకారులతో మాట్లాడుతూ జరిగిన విషయంపై పూర్తిగా తెలుసుకొని తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఆటో స్టాండ్ సమస్యను పరిష్కరించాలి

ఖమ్మం మామిళ్లగూడెం, మార్చి3: ఖమ్మం పాత బస్టాండ్ ఆవరణలో ప్రజల కోసం అందుబాటులో ఉండవలసిన ఆటో స్టాండ్‌ను తొలగించి అధికారుల వాహనాల పార్కింగ్ ప్రదేశంగా మార్చాలని ప్రయత్నించటాన్ని తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఆదివారం టీడీపీ నాయకులు పాత బస్టాండ్ ఆవరణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రయాణీకులు తమ గమ్యస్థానం చేరటానికి ఆటోల్లో వెళ్తారని, ఆటో డ్రైవర్లు కూడ పేద ప్రజలను గమ్యస్థానాలకు చేర్చి తమ జీవనోపాధిని పొందుతున్నారన్నారు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉన్న ఆటో పార్కింగ్ స్థలాన్ని విశాలంగా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఖమ్మం పార్లమెంట్ ఉపాధ్యక్షులు కొండబాల కరుణాకర్, లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు , జిల్లా నాయకులు పాలడుగు క్రిష్ణప్రసాద్, ఖమ్మం నగర ఆటో యూనియన్ నాయకులు మోహన్ రావు, రావుల శ్రీనివాస్, ఎస్డీ పాషా, ఉపేందర్, నాగేశ్వరరావు, మోహన్ రావు, సోందు తదితరులు పాల్గొన్నారు.


ఆటోస్టాండ్‌ను పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

అవమాన భారంతో రైతు ఆత్మహత్యాయత్నం

- రూ.50వేల అప్పు కోసం 60 బస్తాల మిర్చిని తీసుకెళ్లిన కమీషన్‌దారుడు
- ప్రాధేయపడిన వదలని వైనం
- కామేపల్లి మండలం గోవింద్రాలలో ఘటన

కామేపల్లి, మార్చి 3: పండించిన పంటను అప్పు కోసం కమీషన్‌దారుడు పట్టుకెళ్లడంతో అవమాన భారంతో ఓ గిరిజన రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసకున్న సంఘటన కామేపల్లి మండలం గోవింద్రాల గ్రామంలో శనావారం రాత్రి చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గోవింద్రాల గ్రామానికి చెందిన ఆలోత్ సీతారాం, చిన్ని దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది రెండున్నర ఎకరాలలో మిర్చి పంట సాగు చేశారు. ఈ క్రమంలో ఖమ్మంలోని కమీషన్‌దారుడు బానోత్ దస్రూ వద్ద అప్పుగా రూ.50వేలు నగదును తెచ్చుకున్నారు. పంట చేతికి రావడంతో మిర్చి పంటను కూలీలతో వేరించాడు. శనివారం తాలుకాయలను కూడా వేరించి బస్తాలు తొక్కించాడు. బస్తాలు తొక్కించిన విషయం తెలుసుకున్న కమీషన్‌దారుడు శనివారం గోవింద్రాల చేరుకొని బాధితుడిని బెదిరించి తొక్కించిన 60బస్తాలు ఆటో ట్రాలీలో బెదిలోడ్ చేసుకున్నాడు. తొక్కిన బస్తాలు నీ దగ్గరికే తీసుకువస్తున్న అని చెప్పిన వినకుండా, అలానే వాటిని లోడ్ చేసుకున్నాడని తెలిపారు. భార్యభర్తలు ఇద్దరు ఎంతో బతిమిలాడిన, బెదిరించి వాటిని తీసుకొని పోయాడని తెలిపారు. పండించిన పంటను కమీషన్‌దారుడు మొత్తం తీసుకెళ్లడంతో మనస్తాపంతో, అవమానంతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అప్రమత్తమై ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ ఘటన గ్రామంలో చర్చనీయాశంగా మారింది.

అడుగంటిన వైరా రిజర్వాయర్

ప్రస్తుతం 11.8 అడుగుల నీటి మట్టం

వైరా, మార్చి 3: వైరా రిజర్వాయర్ నీటిమట్టం గణనీయంగా తగ్గిపోయింది. ఫలితంగా ఈనెల 8న జరుగనున్న మహాశివరాత్రి పర్వదినాన భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు నీటి కొరత ఏర్పడింది. వైరా, మధిర నియోజకవర్గాల్లో ప్రముఖ శివాలయాలు ఉన్నాయి. వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, అలాగే మధిరలోని మృత్యుంజయస్వామి ఆలయం, మధిరకు సమీపంలోని తెలంగాణ, ఏపీ రాష్ట్రాల సరిహద్దుల్లోని కూడలి వద్ద మహాశివరాత్రి జాతర అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఈ మూడుచోట్ల శివరాత్రి పర్వదినాన లక్షలాది మంది పుణ్యస్నానాలు ఆచరించటం ఆనవాయితీగా వస్తోంది. ఈ మూడు జాతరలకు వైరా నది నీటి లభ్యతే దిక్కుగా ఉంది. అయితే ఈ ఏడాది ఇప్పటికే తీవ్ర ఎండలతో భూగర్భజలాలు పడిపోయాయి. వైరా రిజర్వాయర్‌తో సహా నది మొత్తం నీళ్ల లేక ఎండిపోయింది. ఈ తరుణంలో భక్తులు శివరాత్రి నాడు పుణ్యస్నానాలు చేయటానికి నీటి ఎద్దడి నెలకొంది.

వైరా రిజర్వాయర్‌లో 18 అడుగులకు గాను ప్రస్తుతం 11.8అడుగుల నీటిమట్టం మాత్రమే ఉంది. ఈ రిజర్వాయర్ నుంచి 11మండలాలకు మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మిషన్ భగీరథ తాగునీటి అవసరాల కోసం రిజర్వాయర్‌లో 14అడుగుల మేర నీటి లభ్యత ఉండాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్పష్టమైన ఆదేశాలిచ్చారు. కాగా ఇప్పటికే 14అడుగుల నీటిమట్టం కూడా లేని వైరా నుంచి శివరాత్రి నాడు భక్తుల పుణ్యస్నానాల కోసం రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేయటం కష్టతరంగా ఉంది. స్నానాల లక్ష్మీపురంలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్వగ్రామంలో ఉంది. మధిరలోని మృత్యుంజయస్వామి ఆలయం ఆయన ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గ కేంద్రంలో ఉంది. కూడలి జాతర భౌగోళికంగా ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాలో ఉన్నప్పటికీ మధిర నియోజకవర్గ భక్తులకే కీలకంగా ఉంది. ఈ తరుణంలో వైరా రిజర్వాయర్ నుంచి నది ద్వారా స్నానాల లక్ష్మీపురం, మధిర, కూడలి జాతర్లకు నీటిని విడుదల చేయక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే వైరా నదిలోని జాలిముడి ఆనకట్ట వద్ద నీటి లభ్యత లేక పూర్తిగా అడుగంటిపోయింది. తాగునీటి అవసరాల కోసం ఎన్నెస్పీ నీటిని వైరాకు విడుదల చేయాలనే డిమాండ్ ఉంది. అయితే సాగర్‌లో కూడా నీటి లభ్యత అంతంతమాత్రంగా ఉంది. అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈనెల 8న తొలిసారి వచ్చిన మహాశివరాత్రి పర్వదినాన భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకుగానూ వైరా రిజర్వాయర్ నుంచి నదికి నీటిని విడుదల చేయక తప్పని పరిస్థితి నెలకొంది. ఈ రిజర్వాయర్ నుంచి ఎడమకాల్వ ఏడో నెంబర్, కుడికాల్వ నాల్గో డిస్ట్రిబ్యూటరీ నుంచి వైరా నదిలో స్నానాల లక్ష్మీపురానికి అక్కడి నుంచి జాలిముడి ప్రాజెక్టు గుండా మధిర ఆతర్వాత కూడలికి నీటిని సరఫరా చేయాల్సి ఉంది. అందుకు కనీసం మూడు నుంచి నాలుగు అడుగుల నీరు అవసరముంది. రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతర నిర్వహణపై శనివారం అధికారులు, అనధికారులతో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించిన సందర్భంలో కూడా భక్తుల స్నానాలకు నీటికొరతపై ప్రధాన చర్చ జరిగింది. మధిర ఎమ్మెల్యే అయిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా వైరా నదిలో నీటి ఎద్దడిపైనే సమస్య ఎదురవుతుంది. ఈ పరిస్థితుల్లో ఆరో తేదీ నుంచే వైరా నదికి రిజర్వాయర్ నుంచి నీటి విడుదలపై ఎలాంటి ఆదేశాలు వస్తాయోనని అధికారులు, భక్తులు వేచిచూస్తున్నారు.


డెడ్ స్టోరేజీలో వైరా రిజర్వాయర్

నీటిని అందించాలని భక్తుల వేడుకోలు

పెనుబల్లి, మార్చి 3: మండలంలోని టేకులపల్లి శివాలయంలో ప్రతి ఏడాది జరిగే మహాశివరాత్రి వేడుకలకు పక్కనే ఉన్న నాగార్జునసాగర్ కాల్వలో స్నానాలు భక్తులు ఆచరించి ఆలయంలో పూజలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈ ఏడాది సాగర్‌కాల్వలో నీరు లేకపోవడంతో భక్తులు శివరాత్రి సందర్భంగా స్నానాలకు ఇబ్బందికరంగా మారిందని వాపోతున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా వెంటనే అధికారులు స్పందించి సాగర్ కాల్వకు నీరు విడుదల చేయాలని ఆలయ అర్చకులు సోము సుందర్‌రావు, భక్తులు భీమయ్య, మారుతీ నాగరాజు, వెంకటనర్సమ్మ, కృష్ణమ్మ, గాయం వెంకటకృష్ణ, గౌర ప్రసాద్ కోరారు.


సాగర్‌కాల్వకు నీరు విడుదల చేయాలని వేడుకుంటున్న భక్తులు

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

● ఒక మావోయిస్టు, పోలీసు జవాన్ మృతి

● బీజాపూర్ జిల్లాలో ఆరుగురు మావోయిస్టుల అరెస్టు

దుమ్ముగూడెం/చర్ల, మార్చి 3: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లాలో ఆదివారం పోలీసులు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్టుతో పాటు ఒక పోలీసు జవాన్ మృతి చెందాడు. కాంకేర్ జిల్లా చోటేబేఠియా పోలీస్‌స్టేషన్ పరిధిలోని హిందూర్ అటవీప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో పోలీసు బలగాలు కూంబింగ్ ప్రారంభించాయి. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య గంటల పాటు ఎదురుకాల్పులు జరిగాయి. కాల్పుల అనంతరం పరిశీలించగా ఒక గుర్తు తెలియని మావోయిస్టు మృతదేహంతోపాటు ఏకే-47 తుపాకీ లభించాయి. ఈ ఘటనలో పోలీసు బలగాలనుంచి కూడా ప్రాణనష్టం జరిగింది. బస్తర్ ఫైటర్స్‌కు చెందిన జవాన్ రమేష్ కురేటీ తూటా గాయంతో నేలకొరిగాడు. ఎన్‌కౌంటర్ ప్రాంతంలో పోలీసులు కూంబింగ్ కొనసాగిస్తున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఐదుగురు మావోయిస్టు పార్టీ సభ్యులతో పాటు మరో మహిళా మావోయిస్టును అరెస్టు చేసినట్లు బీజాపూర్ పోలీసులు ఆదివారం తెలిపారు. బీజాపూర్ జిల్లా బంగ్లా పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడవుల్లో కూబింగ్‌కు వెళ్లిన బలగాలకు అనుమానాస్పద స్థితిలో ఐదుగురు వ్యక్తులు తారసపడ్డారు. పోలీసులను చూసి వారు పారిపోతుంగా వెంబడించి పట్టుకున్నారు. అనంతరం వారి నుంచి రెండు కుక్కర్‌బాంబులు, వైర్లు, రెండు డిటోనేటర్లు, కరపత్రాలు, బ్యానర్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేసి కోర్టుకు తరలించారు. అలాగే పామేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని అడవుల్లో కూబింగ్ చేస్తుండగా ఆదివారం ఓ మహిళా మావోయిస్టును అరెస్టు చేశారు. అరెస్టయిన మావోయిస్టుపై రూ.1లక్ష రివార్డు ఉన్నట్లు బీజాపూర్ పోలీసులు తెలిపారు. ఆమె నుంచి పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

యథేచ్ఛగా మట్టి తోలకాలు

ప్రజల సమాచారంతో మూడు ట్రాక్టర్ల పట్టివేత

బోనకల్, మార్చి 3: మట్టి బంగారమైంది..సామాన్యుడికి భారంగా మారింది. ఇళ్ల నిర్మాణ పనుల నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేసే ప్లాట్లు వరకు ప్రతిచోట మట్టి లేనిదే పని జరగడం లేదు. నిబంధనల మేరకు అనుమతులు పొందిన క్వారీలు మండలంలో లేకపోవడంతో కొందరు అక్రమార్కులు కొంత కాలంగా అడ్డదారిలో మట్టి తోలకాలు జరుపుతున్నారు. దీంతో ఇష్టారాజ్యంగా మట్టి ధరలను ట్రక్కుల చొప్పున అమాంతం పెంచేసి ధనార్జన చేస్తున్నారు.

మండలంలోని చిరునోమల గ్రామ రెవెన్యూ పరిధిలో ఆదివారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామున వరకు ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లతో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని సమాచారం. కొంత కాలం నుంచి మండలంలో అక్రమ మట్టి తోలకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. మట్టి తోలకాలు జరపాలంటే నిబంధనల మేరకు మైనింగ్, రెవెన్యూ అధికారుల అనుమతి తప్పని సరిగా తీసుకోవాలి. మట్టితోలకాలు జరిపే భూమిని అధికారులు పరిశీలించి అనుమతులను ఇవ్వాల్సి ఉంటుంది. కొందరు అక్రమార్కులు అంతా తాము చూసుకుంటామని చెప్పి ట్రాక్టర్‌దారులను రంగంలోకి దించుతున్నారు. దీనికితోడు రెవెన్యూశాఖలో క్షేత్రస్థాయి విధులు నిర్వర్తించే వీఆర్వో, వీఆర్ఏల వ్యవస్థ లేకపోవడం దళారులకు కలిసి వచ్చే అంశంగా మారింది. మండలంలోని చిరునోముల, లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలో ప్రధానంగా మట్టితోలకాలు జరుగుతున్నాయని రాత్రివేళల్లో ట్రాక్టర్ల ద్వారా మట్టి తోలకాలు చేయడం వలన ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలగడంతో రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. తహసీల్దార్ పున్నం చందర్ విషయాన్ని పోలీసులకు తెలపడంతో వారు అక్రమ తోలకాలు జరుపుతున్న మూడు టాక్టర్లను పట్టుకున్నారు. కొందరు ట్రాక్టర్‌దారులు అతి వేగంతో వస్తుండటంతో ప్రజలు భయ భ్రాంతులకు లోనవుతున్నారు. అక్రమ మట్టి తోలకాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.


పట్టుబడిన మట్టి ట్రాక్టర్లు

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

ముదిగొండ, మార్చి 3: అనారోగ్యంతో బాధపడుతూ ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ముదిగొండ పారిశ్రామిక ప్రాంతంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రితీష్‌కుమార్‌గౌతమ్(24) ముదిగొండలోని ఓ గ్రానైట్‌లో పని చేస్తున్నాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపానికి గురై శనివారం రాత్రి గ్రానైట్‌కు సమీపంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యువకుడి ఆత్మహత్యపై ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ముదిగొండ, మార్చి 3: ముదిగొండ మండలం పెద్దమండవ నుంచి ఆంధ్రాకు ఆటోలో తరలిస్తున్న 25క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. 25క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని, ట్రాలీ ఆటోను స్వాధీనం చేసుకొని ముదిగొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రేషన్ బియ్యం తరలిస్తున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పట్టుబడిన 25 క్వింటాళ్ల రేషన్‌బియ్యం








ఎరుపెక్కిన నగరం

చైతన్యపు నగరం ఖమ్మం ఎరుపెక్కింది.. పదం పాడుతూ, కదం తొక్కిన కళాకారులను స్వాగతించింది.. ఆదివారం జరిగిన మాస్‌లైన్ సభకు తరలి వచ్చిన కామ్రేడ్లతో అరుణారుణ శోభను సంతరించుకుంది. నాయకులు, కార్యకర్తలతోపాటు మహాసభలకు తరలివచ్చిన ప్రజలతో సందడిగా మారింది. డప్పు వాయిద్యాలు, గిరిజన నృత్యాలు, కళాకారులు కోలాహలంతో ఎర్రజెండాలు చేతబట్టి భారీ ప్రదర్శన ఆకట్టుకుంది.

పట్టుబట్టి.. కొలువు కొట్టి..


సోయం విజయ



తోబుట్టువులు శ్రీకాంత్, మహాలక్ష్మి


బుర్రి రమేష్


సైదులు


తిరుపతిరావు

సత్తుపల్లిరూరల్/ బోనకల్/ మధిర రూరల్/ తల్లాడ, మార్చి3: పట్టుదలకు ప్రయత్నం తోడయితే విజయం పాదాక్రాంతం అవుతుందని మరోసారి నిరూపితమైంది. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో పట్టువదలకుండా చదివిన పలువురిని అదృష్టం తలుపుతట్టింది. పలువురికి మూడు నాలుగు ఉద్యోగాలు రావడం అభినందించదగిన విషం. గత ఏడాది ఆగస్టులో పోటీ పరీక్షలు రాసిన సత్తుపల్లి మండలానికి చెందిన సోయం విజయ నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. జేఎల్(తెలుగు), పీజీటీ తెలుగు, టీజీటీ (తెలుగు), టీజీటీ(సోషల్) ఉద్యోగాలు సాధించారు.

అన్నకు నాలుగు.. చెల్లికి రెండు..

బోనకల్ మండలం చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన అన్నా, చెల్లెలు కోటపర్తి శ్రీకాంత్, మహాలక్ష్మి ప్రభుత్వ ఉద్యోగాల్లో రికార్డు సృష్టించారు. శ్రీకాంత్ డీఎల్, జేఎల్, పీజీటీ, ఏకలవ్య మోడల్ స్కూల్‌లో టీజీటీగా ఆంగ్ల ఉపాధ్యాయుడిగా నాలుగు ఉద్యోగాలు ఒకేసారి ఎంపికయ్యాడు. అతడి సోదరి మహాలక్ష్మి జేఎల్, టీజీటీ ఆంగ్ల టీచర్ ఉద్యోగాలకు ఎంపికైంది. అన్నా చెల్లెళ్లు ఆంగ్ల బోధకులుగా ఉద్యోగాలకు ఎంపిక కావడం విశేషం.

హ్యాట్రిక్ కొట్టిన రమేష్..

మధిర మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన బుర్రి రమేష్ ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. పీజీటీ, టీజీటీ, జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలు సాధించాడు. గురుకుల పాఠశాలలో చదివిన రమేష్ అదే గురుకులంలో అధ్యాపక ఉద్యోగం సాధించడం విశేషం.

పోలీసు విభాగంలో...

తల్లాడ మండలం మల్లవరం గ్రామానికి చెందిన కుంచం సైదులు 2020లో రాష్ట్ర ప్రత్యేక పోలీసు విభాగంలో కానిస్టేబుల్, 2023వ సంవత్సరంలో సింగరేణి జూనియర్ అసిస్టెంట్ గ్రేడ్-2, రాష్ట్ర పోలీసు విభాగంలో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. అదే గ్రామానికి చెందిన తుటారి తిరుపతిరావు వరుసగా రెండేళ్లలో 2022లో సీఐఎస్ఎఫ్ శాఖలో జేడీ కానిస్టేబుల్‌గా, 2023లో సీఐఎస్ఎఫ్ శాఖలో ఫైర్ కానిస్టేబుల్‌గా, రాష్ట్ర పోలీస్‌శాఖలో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగాలు సాధించారు.

'తాలిపేరు'కు సెన్సార్లు

- ప్రాజెక్టుకు అత్యాధునిక టెక్నాలజీ
- పర్యవేక్షణకు కెమెరాలు, కంట్రోల్ రూం సిద్ధం
- ఉధృతిని కచ్చితంగా అంచనా వేయగల సామర్థ్యం
- అత్యవసర పరిస్థితిలో వాటికవే తెరుచుకోనున్న గేట్లు
- వచ్చే వానాకాలం నాటికి ప్రారంభించడానికి కసరత్తు


ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కెమెరాలు


కంట్రోల్ రూం

వరదలొస్తే అప్రమత్తం చేయనున్న ఉపకరణలు

చర్ల, మార్చి 3: తాలిపేరు ప్రాజెక్టును ఆధునికీకరించడంలో భాగంగా అధికారులు, ప్రాజెక్టుకు నూతన టెక్నాలజీని అమర్చుతున్నారు. ప్రాజెక్టులోని అన్ని గేట్లకు సీసీ కెమేరూనాలు, సెన్సార్స్ ని ఏర్పాటు చేశారు. వీటిని పర్యవేక్షించేందుకు కంట్రోల్ రూంని సిద్ధం చేశారు. ఇప్పటికే పనులు 90 శాతం పూర్తి కావచ్చాయి. ఇంకా కొంత వరకు వైరింగ్ చేస్తే పనులు మొత్తం పూర్తి అయినట్లే నని అధికారులు చెబుతున్నారు. పనలు పూర్తి అయితే ట్రయల్ రన్‌కు ప్రాజెక్టుకు సిద్ధమైనట్లే.

అన్ని గేట్లకు సెన్సార్లు...

ప్రాజెక్టు ఉన్న 25 గేట్లలో అన్ని గేట్లకు అధికారులు కెమేరాలు, సెన్సార్లు ఏర్పాటు చేశారు. ప్రాజెక్టుపై భాగంలోనూ కెమేరాలను అమర్చారు. వర్షం కురిస్తే వచ్చే వరదలను అంచనా వేస్తూ గేట్లు వాటంతట అవే తెరుచుకుంటాయి. వరద తీవ్రతను బట్టి ఏ స్థాయి వరకు వరద వస్తుందనేది కూడా సెన్సార్స్ లెక్కగట్టి అధికారులను ప్రమత్తం చేయనున్నాయి. వీటికి సంబంధిదించిన పనులు మొత్తం పూర్తయ్యాయి. కాగా గతంలో ప్రాజెక్టుకు భారీ వరద వచ్చిన సమయంలో వరద తీవ్రతను అధికారులు అంచనా వేయలేక పోయారు. దీంతో గేట్లు కూడా కొట్టుకుపోయాయి.

ప్రత్యేకంగా కంట్రోల్ రూం..

సెన్సార్లను పర్యవేక్షంచేదుకు అధికారులు ప్రాజెక్టు వద్ద ప్రత్యేక గదిని సిద్ధం చేశారు. అందులో ఇంటర్‌నెట్, కంప్యూటర్ సిస్టమ్, ఇతర పరికరాలను అమర్చారు. ఈ పనులు కూడా చాలా వరకు పూర్తి అయ్యాయని అధికారులు చెబుతున్నారు.

వర్షం పడే సమయంలో సిబ్బంది లేక పోయినా, సైరన్ ఇచ్చుకుంటూ గేట్లు తెరుచుకుంటాయని అంటున్నారు. వీటన్నింటికి సంబంధించిన పనులు కూడా 90 శాతం పూర్తి అయ్యాయి. కాగా పనులు పూర్తియిన వెంటనే అధికారులు ట్రయల్ రన్ వేయనున్నారు. వచ్చే వర్షా కాలం నాటికి ప్రాజెక్టు సెన్సార్స్‌తో, వర్షం పడితే చాలు గేట్లు తెరుచుకోనున్నాయి. కాగా ప్రాజెక్టు పాతది కాబట్టి సెన్సార్స్ ఉన్నా, కొంత వరకు మ్యాన్ పవర్ ఉండాల్సి వస్తుందని ప్రాజెక్టు డీఈ తిరుపతి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

నేటి నుంచి ఇరు జిల్లాల్లో ఇంటర్మీడియట్ స్పాట్

- నాలుగు దశల్లో జరుగనున్న మూల్యాంకనం
- కొత్తగూడెంలో తొలిసారి క్యాంపు

ఖమ్మం ఖానాపురంహవేలీ/ కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి 3: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఇంటర్మీడియట్ స్పాట్ మూల్యాంకనం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. సంస్కృతం సబ్జెక్టు స్పాట్ వాల్యుయేషన్ క్యాంప్‌ను ఖమ్మం నగరంలోని నయాబజార్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ఖమ్మం జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి కె.రవిబాబు తెలిపారు. ఈస్పాట్ వాల్యుయేషన్‌కు సంబంధించి ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో పనిచేస్తున్న పలువురు అధ్యాపకులను నియమించారు. వారికి కళాశాలనుంచి రిలీవింగ్ ఆర్డర్లు అందించారు. మొత్తం నాలుగు దశల్లో ఈస్పాట్ వాల్యుయేషన్ నిర్వహించనున్నారు. సంస్కృతం పేపర్1లో 18,050, పేపర్2లో 16,518 పేపర్లను మూల్యాంకనం చేయనున్నారు. గతంలో ఉమ్మడి జిల్లా వాల్యుయేషన్ ఖమ్మం నగరంలో నిర్వహించారు. ఈఏడాది నుంచి ఏజిల్లా మూల్యాంకనం ఆజిల్లాలో ఏర్పాటు చేయడంతో కేవలం ఖమ్మం జిల్లా ఇంటర్ వాల్యుయేషన్ ఖమ్మంలో నిర్వహించనున్నారు.

భద్రాద్రి జిల్లాకు ఇంటర్ 'స్పాట్'


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఇంటర్మీడియట్ పరీక్ష మూల్యాంకన కేంద్రం మంజూరు కావడం హర్షించదగిన విషయమని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం కొత్తగూడెం సింగరేణి మహిళా జూనియర్ కళాశాలలో నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం సింగరేణి మహిళా జూనియర్ కళాశాలకు స్పాట్ క్యాంప్‌గా ఏర్పాటు చేసినందుకు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఏడాది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ఖమ్మం ప్రాంతంలోని ఇంటర్మీడియట్ మూల్యాంకన కేంద్రానికి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది వెళ్తూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు.

అరుదైన వ్యాధుల పట్ల అవగాహన అవసరం

- ప్రొఫెసర్ రామయ్య

ఖమ్మం కలెక్టరేట్, మార్చి3: అరుదైన వ్యాధుల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని ఇండియన్ ఆర్గనైజేషన్ ఫర్ రేర్ డిజీజెస్ ప్రెసిడెంట్, సీఈవో ప్రొఫెసర్ రామయ్య ముత్యాల అన్నారు. ఆదివారం ఖమ్మం ఐఎంఏ హాల్లో ప్రజలకు అరుదైన వ్యాధుల పట్ల అవగాహన వాటిని వ్యాపించకుండా చూసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై అవగాహన సదస్సును నిర్వహించారు.

ఈసందర్భంగా రామయ్య మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికి నాణ్యమైన ఆరోగ్య సంరక్షణే లక్ష్యమన్నారు. అరుదైన వ్యాధుల గల రోగులకు వనరులు, సేవలే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అరుదైన వ్యాధులు ఏడు వేలకు పైగా గుర్తించబడ్డాయని, ఈ పరిస్థితులతో ప్రపంచంలో మిలియన్ల మంది ప్రజలు ప్రభావితం అయ్యారని అన్నారు. ఈ వ్యాధులలో చాలా వరకు ఎటువంటి నివారణలు లేవు. చికిత్స మాత్రమే ఉందన్నారు.. అరుదైన వ్యాధిగ్రస్తులలో 60 శాతం మంది పిల్లలు కూడా గురవుతున్నారని అన్నారు. ఈ సదస్సులో దీపక్ చౌదరి నాగండ్ల, సీనియర్ ఎగ్జిక్యూటివ్ విజయ్ మోహన్ సూరి, స్వర్ణ భారత్ ట్రస్ట్ ప్రతినిధులు డాక్టర్ రాజేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఖమ్మండాక్టర్ వీ సుబ్బారావు, వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వినుబ్బారావు, డాక్టర్ సామినేని రాఘవులు తదితరులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ రామయ్య

'మాస్‌లైన్'కు విదేశీ ప్రతినిధులు



జర్మనీ నుంచి వచ్చిన ప్రతినిధులు

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 3: మాస్‌లైన్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం జాతీయ మహాసభలకు జర్మనీ, నేపాల్ నుంచి విదేశీ ప్రతినిధులు హాజరయ్యారు. ఆయా దేశాల్లో ఎంఎల్ పార్టీకి అనుబంధంగా ఉన్న కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులు తమ పార్టీ జెండాలను చేతబూని మహాసభలకు హాజరయ్యారు. మహాసభలో ముఖ్య నాయకుల మాట్లాడుతున్న దృశ్యాలను చిత్రీకరించి వారి దేశాల మీడియాకు ప్రత్యేకంగా పంపారు.


నేపాల్ ప్రతినిధి

పాలేరు జేఎన్‌టీయూకు బాలారిష్టాలు



> జిల్లాల్లోనూ మెరుగైన ఇంజనీరింగ్ విద్యను అందించేందుకు గత ప్రభుత్వం మంజూరు చేసిన పాలేరు జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల తాత్కాలిక వసతులతోనే కొనసాగుతోంది. శాశ్వత భవనాలు, సౌకర్యాలు లేకపోవడంతో కళాశాలలో విద్యాప్రమాణాలు ఆశించినస్థాయిలో ఉండడంలేదు. సాధ్యమైనంత త్వరగా ఈ కాలేజీకి శాశ్వత భవనాలు, వసతులు, సిబ్బందిని సమకూరుస్తామని గత ప్రభుత్వం పేర్కొన్నా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. కనీసం వచ్చే విద్యాసంవత్సరానికైనా శాశ్వతఏర్పాట్లపై ప్రభుత్వం చర్యలు ప్రారంభిస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశిస్తున్నా ఆ దిశగా అడుగులు వేయడంలేదు. త్వరలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉండడంతో ఈలోపే కాలేజీలకు భూములు, నిధులు కేటాయించి శంకుస్థాపనలు చేస్తేనే పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

- గత ఏడాది మద్దులపల్లి వద్ద ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ ప్రారంభం
- తాత్కాలిక వసతులతోనే నిర్వహణ
- విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్‌కూడా కరువు

ఖమ్మం, మార్చి 3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గత ఏడాది ఎంసెట్ కౌన్సెలింగ్ ముగుస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మంరూరల్ మండలం మద్దులపల్లి వద్ద ఐటీడీఏ ట్రైనింగ్ సెంటర్‌లో ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు చేశారు. అయితే కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తికావడంతో స్పెషల్ కౌన్సెలింగ్ ద్వారా తక్కువమంది విద్యార్థులే ఈ కాలేజీల్లో అడ్మిషన్లు పొందారు. వాస్తవానికి ఈ కాలేజీలో సీఎస్‌ఈ, డేటాసైన్స్, ట్రిబుల్‌ఈ, ఈసీఈ, మెకానికల్ బ్రాంచీలను ప్రారంభించాల్సి ఉండగా కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తికావడంతో సీఈసీ, డేటాసైన్స్ గ్రూపులను మాత్రమే ప్రారంభించారు. ప్రస్తుతం ఈ కాలేజీలో 44మంది విద్యార్థులుండగా ఇప్పటి వరకు విద్యార్థులకు కంప్యూటర్ తదితర ల్యాబ్‌లను ఏర్పాటు చేయలేదు.

స్థలం గుర్తించినా కేటాయింపులేవీ..?

పాలేరు జేఎన్‌టీయూ కాలేజీ కోసం పాలేరు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్వయంగా స్థలాన్ని పరిశీలించి ఖమ్మం కలెక్టర్‌కు చెప్పడంతో 30ఎకరాల పైగా స్థలం గుర్తించి సీసీఎల్‌కు ప్రతిపాదనలు పంపారు. కానీ ఇప్పటివరకు స్థలాన్ని ఇంజనీరింగ్ కాలేజీకి అధికారికంగా కేటాయించలేదు. కొత్త జేఎన్‌టీయూ కాలేజీల్లో వచ్చే విద్యా సంవత్సరానికి ఐదు గ్రూపులు ప్రారంభం కానున్నాయి. దాంతో వచ్చే విద్యా సంవత్సరానికి సుమారు 500మంది విద్యార్థులు కాలేజీలో చదివే అవకాశం ఉంది. కానీ ప్రస్తుతం ఉన్న తాత్కాలిక భవనంలోని గదులు ఇంతమంది విద్యార్థులకు ఏ మూలకూ సరిపోవు. కాబట్టి ప్రభుత్వంఈలోపే స్థలం కేటాయించి నిధులు కేటాయిస్తేనే రాబోయే రెండేళ్లలో పనులు పూర్తి చేసే అవకాశం ఉంటుంది.

పూర్తిస్థాయి బోధన సిబ్బంది కరువు

కొత్త కాలేజీలకు పర్మినెంట్ ప్రిన్సిపాల్స్‌ను మాత్రమే నియమించారు. ఒక్కో కాలేజీలో ఏడుగురు చొప్పున కాంట్రాక్టు పద్ధతిలో సిబ్బందిని నియమించి విద్యాబోధన సాగిస్తున్నారు. నాన్‌టీచింగ్ స్టాఫ్ కూడా అవుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్నారు. వచ్చే ఏడాదికి గ్రూపులు, తరగతులు పెరుగుతున్నందున మరో 20 మంది వరకు ఫ్యాకల్టీ అవసరం. నాన్‌టీచింగ్ స్టాఫ్ భారీ సంఖ్యలో అవసరం ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆయా కాలేజీలకు స్థలం, నిధులు, ఫ్యాకల్టీని, సిబ్బందిని నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ధరణి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి

- అధికారులతో ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్


సమీక్షిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 3: ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్, కలెక్టరేట్ పర్యవేక్షకులు, ధరణి పర్యవేక్షకులతో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై మార్చి 1 నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో ప్రత్యేక డ్రైవ్ కు ముందు 10265 ధరణి దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయన్నారు. ఇప్పటివరకు క్షేత్ర, రికార్డ్స్ నమోదు పరిశీలనల అనంతరం ప్రత్యేక డ్రైవ్ లో 1300 దరఖాస్తులు పరిష్కరించినట్లు తెలిపారు. వీటిలో 800 దరఖాస్తులను ఆమోదించి, రైతులకు పాస్ బుక్ల జారీకి సిఫారసు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆర్డీవో, కలెక్టరేట్ కార్యాలయాల్లో ఆదివారం కూడా ప్రత్యేక డ్రైవ్‌నిర్వహించామన్నారు. ఆదివారం ఒక్కరోజునే 510 దరఖాస్తులను పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. దరఖాస్తుల పరిష్కారానికి పటిష్ట కార్యాచరణ చేస్తున్నామన్నారు. దరఖాస్తుల ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, ఎస్డీసీ ఎం. రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో అరుణ, పర్యవేక్షకులు మదన్ గోపాల్, మీనన్, సత్యనారాయణ, రాంబాబు, ఓఎస్డీ నాగేశ్వరరావు, ధరణి కోఆర్డినేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
ఆంధ్రజ్యోతి
సోమవారం 4 మార్చి 2024 | 6 | కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట

పల్స్ పోలియో విజయవంతం

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, అధికారులు
నేడు, రేపు కొనసాగనున్న కార్యక్రమం
పోలియో రహిత సమాజమే లక్ష్యం: నేతలు

జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. పోలియో రహిత సమాజమే లక్ష్యం కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.


'పేట'లో పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే


దమ్మపేట జడ్పీ పాఠశాలలో..


పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని


మణుగూరులో చుక్కలు వేస్తున్న పాయం


ఇల్లెందులో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య


టేకులపల్లిలో..


చుక్కలు వేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల


చుంచుపల్లి ఎంపీపీ శాంతి


దుమ్ముగూడెంలో చుక్కలు వేస్తున్న జడ్పీటీసీ


కరకగూడెంలో చుక్కలు వేస్తున్న ఎంపీపీ కౌశిక


అశ్వాపురంలో చుక్కలు వేస్తున్న ఎంపీపీ సుజాత


మణుగూరు టీడీపీ సెంటర్‌లో


ఆళ్లపల్లిలో..


జూలూరుపాడులో...

భక్తిశ్రద్ధలతో సామూహిక పొంగలి కార్యక్రమం



అశ్వారావుపేట రూరల్, మార్చి 3: అశ్వారావుపేటలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం సామూహిక పొంగలి కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. మాఘ ఆదివారం సందర్భంగా ఆలయంలో పొంగలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం కన్యకా పరమేశ్వరి అమ్మవారికి వివిధ రకాల పూజలు నిర్వహించారు. అనంతరం పెద్ద పొయ్యిని ఏర్పాటు చేసి మహిళలు పొంగలి వండారు. అనంతరం భజన కార్యక్రమాలను నిర్వహించారు.

పేదింటి ఆడపిల్లలకు కల్యాణలక్ష్మి వరం: కూనంనేని

పాల్వంచ టౌన్, మార్చి 3: పేదింటి ఆడపిల్లకు కల్యాణలక్ష్మి పథకం వరం లాంటిదని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశపు హాలులో పట్టణ, మండల పరిధిలోని 120మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక ముందు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు రూ.లక్షా 16వేలతోపాటు తులంబంగారం కూడా రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని నూతన ప్రభుత్వం అందచేయనుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జి.వివేక్, మున్సిపల్ డీఈ కె.మురళీ, పబ్లిక్‌హెల్త్ డీఈ శ్రీనివాసరావు, సీడీపీవో కనకదుర్గ పాల్గొన్నారు.

రూ.1.20కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

పట్టణ పరిధిలో రూ. 1.20కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. వాటిలో రూ. 50లక్షలు ఎస్సీ వెల్ఫేర్ నిధులు, రూ.50లక్షలు పట్టణ ప్రగతినిధులు, రూ.20లక్షలు జనరల్ ఫండ్ నిధులు


చెక్కును అందజేస్తున్న కూనంనేని

మొత్తం రూ.1.20కోట్లతో అయ్యప్పనగర్‌లో సీసీ రోడ్డు, శ్రీనివాసకాలనీలో యానిమల్‌బర్త్ కంట్రోల్ సెంటరు, బొల్లోరుగూడెం పార్కు ప్రహరీగోడ, అంబేద్కర్‌భవన్ శంకుస్థాపన పనులను చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ కె.మురళీ, పలుశాఖల అధికారులు డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీలో ఎమ్మెల్యే పాయం పర్యటన

మణుగూరుటౌన్, మార్చి 3: మణుగూరు ఏరియాలోని శివలింగాపురం పీహెచ్‌సీలో పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మున్సిపల్ సిబ్బంది, స్థానికులతో కలసి ఆ ప్రాంతంలో పర్యటించారు. స్థానికుల ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన పారిశుధ్యానికి సంబంధించిన ప్రాంతాలను సందర్శించి తనతో వచ్చిన మున్సిపల్ కమీషనర్‌తో పాటు సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని లేని పక్షంలో వర్షాకాలంలో అంటు వ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశ ముందని హెచ్చరించారు. ప్రత్యేకంగా పారిశుధ్య పనుల నిర్వహణ లోపమున్న ప్రాంతాలను గుర్తించి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

శ్రమదానంతో మురుగు కాలువలు శుభ్రం..

మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరనగర్ ప్రాంతంలో ఎంతకు మున్సిపల్ సిబ్బంది పట్టించుకోవడం లేదంటూ విసిగిపోయిన స్థానికులు ఆదివారం పారిశుధ్య పనులకు నడుం బిగించారు. శ్రమదానంతో మురుగు


శివలింగాపురంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పాయం

కాలువలను శుభ్రం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇందిరనగర్ వాసులు మున్సిపల్ కార్యాలయ సిబ్బందికి పలు మార్లు దరఖాస్తులు ఇచ్చి పారిశుధ్య పనులు నిర్వహించాలని వేడుకున్నా.. పట్టించుకునే నాధుడే లేడని, విసిగిపోయిన తామే శ్రమదానంతో శుభ్రం చేసుకోవాలనుకున్నట్లు సోషల్ మీడియా వేదికగా మెసేజ్‌లను పోస్టు చేసారు. ఇది చర్చనీయాంశమైంది.

ముగిసిన కట్ట మైసమ్మ జాతర

అశ్వారావుపేట రూరల్, మార్చి 3: మండలంలోని నారాయణపురంలో ఐదు రోజుల పాటు అత్యంత ఘనంగా జరిగిన కట్టమైసమ్మ ఆలయ 13వ జాతర ఆదివారం ముగిసింది. ఆఖరి రోజు వేలాదిగా భక్తులు హాజరయ్యారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి వివిధ రకాల పూజలు జరిపారు. మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ నిర్వాహకులు, నాయకులు పాల్గొన్నారు.

కోలాహలంగా అమ్మవారి ఆలయాలు

మండలంలోని వినాయకపురంలో గల చిలకలగండి ముత్యాలమ్మ ఆలయం, గోగులపుడి గుబ్బల మంగమ్మ ఆలయాలు ఆదివారం భక్తులతో కోలాహలంగా మారాయి. వినాయకపురంలోని ముత్యాలమ్మ ఆలయాన్ని ఎమ్మెల్యే జారే నారాయణ దర్శించుకున్నారు. ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ బాధ్యులు, కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయంలో


పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా

జరిగిన అన్నప్రాసన కార్యక్రమంలో పాల్గోని చిన్నారిని దీవించారు. ఇక వివిధ రెండు ఆలయాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయాల వద్ద కోలాహలం నెలకొంది.

ఢిల్లీ రైతుల పోరాటంతో మోదీ పాలనకు చరమగీతం



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వెంకట్

కొత్తగూడెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గత నెల 13వ తేదీ నుంచి ఢిల్లీ సరిహద్దుల్లో హర్యానా, పంజాబ్ రైతాంగం చేస్తున్న పోరాటం కేంద్రంలోని మోదీ, బీజేపీ ప్రభుత్వ పాలనకు చరమగీతం రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పాడుతుందని సీపీఎం కేంద్రకమిటీ సభ్యులు బి.వెంకట్ అన్నారు. ఆదివారం కొత్తగూడెంలో జరిగిన జిల్లా కేంద్ర స్టడీ సర్కిల్‌లో ఆయన మాట్లాడుతూ హాజరై హర్యానా, పంజాబ్ రైతాంగ పోరాటాన్ని వివరిస్తూ 2022లో 379రోజులపాటు ఢిల్లీ సరిహద్దుల్లో సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వంలో జరిగిన మూడు నల్ల వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం విరోచిత పోరాటాన్ని సాగించారని, స్వాతంత్ర్య పోరాటం తర్వాత దేశంలో సుదీర్ఘ కాలంగా జరిగిన పోరాటం రైతాంగ పోరాటమే అన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రధాన మంత్రి మోదీ నల్ల వ్యవసాయ చట్టాలను రద్దు చేస్తున్నామని, రైతాంగాన్ని క్షమించమని, రైతులపై పెట్టిన కేసులు ఎత్తి వేస్తామని పార్లమెంట్ సాక్షిగా ప్రకటన చేసిన అనంతరం మాత్రమే రైతాంగం పోరాటాన్ని విరమించారని తెలిపారు. కానీ ఆచరణలో మాత్రం మోదీ ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదని, పైగా మూడు నల్ల వ్యవసాయ చట్టాలను దొడ్డిదారిన అమలు చేస్తున్నారన్నారు. దీంతో తిరిగి రైతాంగం ఫిబ్రవరి 13 నుంచి పోరాటాన్ని ప్రారంభం చేశారని, పోరాటంలో ఉన్న రైతాంగాన్ని పిలిచి ఇప్పటికి ఐదుసార్లు చర్చలను మంత్రుల బృందం చేసినప్పటికీ తూతూ మంత్రంగా చర్చలు జరిపారని గుర్తు చేశారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర సమస్య, స్వామినాధన్‌కమిషన్ సిపార్సులను అమలు, రైతులపై కేసులు ఎత్తివేయడం, లాఖింపూర్ ఘటనలో రైతుల చావుకి కారణమైన మంత్రిని క్యాబినెట్ నుంచి తొలగించడం వంటి సమస్యలపై స్పష్టమైన సమాధానం చెప్పలేదన్నారు. పైగా పోరాటంలో ఉన్న రైతాంగంపై కాల్పులు జరిపి ఒక యువ రైతుని కాల్చి చంపారని, ఢిల్లి సరిహద్దుల్లో దేశ సరిహద్దుల్లో సైనికులను పెట్టినట్లు పోలీస్ యంత్రాంగాన్ని పెట్టి రైతులపై తీవ్ర నిర్బంధాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ స్టడి సర్కిల్‌లో ఇన్‌చార్జ్ ఏజే రమేష్, పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు శ్రీని వాస్, సత్యనారాయణ, శ్రీధర్, భూక్యా రమేష్, నాయకులు డి.వీరన్న, ఎస్.లక్ష్మి, ఉపేష్ పాల్గొన్నారు.

కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయాలి

దమ్మపేట, మార్చి 3: ఉద్యాన పంటలకు పేరుగాంచిన అశ్వారావుపేట ప్రాంతంలో కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయాలని రైతు ఆలపాటి రాము ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. శ్రీరాంపురం గ్రామంలో ఆదివారం సాయంత్రం కొబ్బరి రైతులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతు పామాయిల్ తరువాత అత్యధికంగా రైతులు కొబ్బరి సాగు చేస్తున్నారని కొబ్బరి సాగు చేస్తున్న రైతులు సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. వ్యవసాయ కళాశాలకు అనుబంధంగా కొబ్బరి బోర్డు ఏర్పాటు చేస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా వుంటుదన్నారు. ఈ సమావేశంలో రైతులు కొమ్ము పుల్లయ్య, దొడ్డా ప్రసాదు, దొడ్డా లక్ష్మినారాయణ , ఎండ్రాతి అప్పారావు, మోరంపూడి కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ వైద్యశాల సేవలు అభినందనీయం

చర్ల, మార్చి 3: పేదల కోసం ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, ప్రతీ ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించడం చాలా సంతోషకరమని చర్ల ఎంపీపీ గీదా కోదండ రామయ్య, జడ్పీటీసీ ఇర్పా శాంత అన్నారు. చర్ల హైస్కూల్ ఆవరణలో ఆదివారం భద్రాచలానికి చెందిన నేతాజీ వైద్యశాల సిబ్బంది ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. చర్ల మండలంలో అనేక మంది నిరుపేదలే అన్నారని తెలిపారు. వారికోసం ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వైద్యం, మందులు అందిచడం సంతోషకరమన్నారు. ఇలానే క్యాంపులు ఏర్పాటు చేసి పేదలకు వైద్యం అందించాలని సూచించారు. నేతాజీ వైద్యశాల్లో లాప్రోస్కోపి, పల్మనాలజీ వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని వైద్యశాల ఛాతివైద్యనిపుణులు ఎస్ జగదీష్, సుకన్య రెడ్డిలు తెలిపారు. వైద్యశిబిరంలో వైద్యశాల నిర్వాహకులు నరసింహారెడ్డి, జక్కిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ట్రైకార్ జీఎం ఆకస్మిక తనిఖీలు

దుమ్ముగూడెం, మార్చి 3: కొత్తపల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో శనివారం రాత్రి, కెరేగుబల్లి గిరిజన బాలికల ఆశ్రమపాఠశాలలో ఆదివారం ట్రైకార్ జీఎం శంకర్‌రావు ఆకస్మిక తనిఖీలు చేశారు. పదవ తరగతి విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమౌతున్న తీరును సమీక్షించారు. పాఠశాలల రికార్డులను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందజేయాలని సూచించారు. చదువుల్లో వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేటాయించాలన్నారు. పరీక్షలపై భయం పోయేలా విద్యార్థులను తయారు చేయాల్సిన బాధ్యత సబ్జెక్టు టీచర్లపై ఉందన్నారు. పిల్లల మానసిక స్థితి గతులను ఎప్పటికప్పుడు గమనించి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపాలని సూచించారు. ఏటీడీఓ నర్సింహారావు, హెచ్‌ఎంలు మోతీరు, నాగమణి, వార్డెన్లు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి

రుద్రంపూర్, (సింగరేణి) మార్చి 3: సింగరేణి యాజమాన్యం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు కొత్తగూడెం ప్రాంతంలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వరరావు కోరారు. ఆదివారం స్థానిక ఎస్సీ, ఎస్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యావంతులైన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా సింగరేణి యాజమాన్యం చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు జమ్మిడి మల్లేష్, ఊట్ల గణేష్, మీసాల శ్రీహరి, మనీష్ విక్టర్, ఎం. నర్సింగరావు, బూర్గుల రామారావు, మొగిలిపాక రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కరకగూడెం, మార్చి 3: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కరకగూడెం తహసీల్దార్ నాగ ప్రసాద్ అన్నారు. ఆదివారం మండలంలోని చిరుమళ్ల పంచాయితీలోని ఆశ్రమ పాఠశాలను తహసీల్దార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో చెత్తతో ఉండటం.. వంటశాల వద్ద నీటి నిల్వ ఉండటం చూసిన ఆయన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా నీరు నిల్వ ఉండటం వలన దుర్వాసన వస్తుందని దాంతో దోమలు వృద్ధి చెంది విద్యార్థులు రోగాల బారిన పడతారని, తక్షణమే శుభ్రం చేయాలని హెచ్చరించారు. అనంతరం విద్యార్థుల హాజరు వివరాలను వార్డెన్ సంపత్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తక్కువమంది ఉన్నారని ఎందుకు ఇంటికి పంపించారని త్వరలోనే అందరిని పాఠశాలలో చేర్పించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలలో సమస్యలు, మెనూ వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో పది పరీక్షలు ఉన్నందున విద్యార్థులకు ప్రత్యేక చదువులు నేర్పించాలని, విద్యార్థుల మార్కుల శాతం ఎక్కువగా వచ్చేలా చూడాలని కోరారు. వారంలో మళ్లీ విజిట్‌కు వస్తానని, పాఠశాల పరిశుభ్రంగా ఉండాలని, లేని పక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకునే విధంగా చూస్తానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ సంపత్, ఆర్ఐ హుస్సేన్, నరేష్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి: జారే


జీరో బిల్లుతీస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

అశ్వారావుపేట రూరల్, మార్చి 3: పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పాటుపడుతుందని, అభయహస్తం ఆరు గ్యారంటీలను అమలు చేయటం జరుగుతుందని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మండలంలోని వినాయకపురంలో ఆదివారం గృహజ్యోతి కార్యక్రమంలో భాగంగా జీరో కరెంటును బిల్లును తీసి వినియోగదారులకు అందించారు. ఈ సందర్భంగా లబ్దిదారులు తాము నెలనెలా కరెంటు బిల్లును కట్టేవారిమని, బిల్లు లేటు అయితే అనేక ఇబ్బందులు పడి కట్టాల్సి వచ్చేదని, ప్రభుత్వం తాజాగా రెండు వందల యూనిట్ల కరెంటును ఫ్రీగా ఇవ్వటం ద్వారా తమ ఇక్కట్లు తొలిగిపోయాయని తెలిపారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఎన్ని ఇబ్బందులు ఉన్నా అమలు చేస్తామన్నారు.

బస్టాండ్ ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలి

అశ్వారావుపేట బస్టాండ్‌లో పోలియో చుక్కలు వేసిన అనంతరం బస్టాండ్ ఆవరణను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఇప్పటికే రెండుసార్లు బస్టాండ్‌ను తనిఖీ చేసిన ఎమ్మెల్యే జారే బస్టాండ్ అభివృద్ధికి పాటుపడతానని, అధికారులు అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అనంతరం బస్టాండ్‌లోని హోటల్‌ను తనిఖీ చేశారు. హోటల్ నిర్వాహకులతో మాట్లాడారు. లోపల పరిశుభ్రంగా ఉంచాలని, ప్రయాణికులకు నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు.

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

ములకలపల్లి: మండలంలో ఆదివారం జరిగిన పలు కార్యక్రమాల్లో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొన్నారు. ములకలపల్లి మండలం జగన్నాధపురం గ్రామంలో గృహజ్యోతి పథకంలోని జీరో బిల్లును ఎమ్మెల్యే జారె ఆదినారాయణ స్వయంగా తానే తీసి లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ ప్రతి నెల కరెంట్ బిల్లు కోసం డబ్బులు వెతుక్కునే పరిస్థితి ఉండేదన్నారు. కొన్నిసార్లు బిల్లు కట్టని పక్షంలో తర్వాత నెలలో పెనాల్టీతో సహా కట్టింకచుకునే వారని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కరెంట్ బిల్లు లేకుండ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ములకలపల్లి మండలం ఒడ్డురామవరం గ్రామంలో ఆదివారం బోడ వారి వివాహం బిందు ప్రియ, అభినాయక్‌ల వివాహానికి హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. తిమ్మంపేట గ్రామంలో రాయల నవీన్ కుమారుడైన దీక్షిత్ ఆర్య తలలో నీరు చేరడంతో ఎమ్మెల్యే చొరవతో ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన దీక్షిత్ ఆర్యను ఎమ్మెల్యే పరామర్శించారు.

నిరుపేద లబ్ధిదారులు అధైర్యపడొద్దు


పాత కొత్తగూడెం ప్రాంతంలో పర్యటిస్తున్న సీపీఐ కౌన్సిలర్లు, నేతలు

కొత్తగూడెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): చోటా మోటా నాయకుల అసత్య ప్రచారంతో ఇంటి స్థలానికి అర్హత సాధించిన నిరుపేద లబ్ధిదారులు అధైర్యపడొద్దని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇంటి స్థలం కేటా యించేలా కృషి చేసేందుకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హామీ ఇచ్చా రని సీపీఐ కౌన్సిలర్లు, నాయకుల బృందం స్పష్టం చేసింది. ఆదివారం పట్టణ పేదలకు పాత కొత్తగూడెంలో కేటాయించిన ఇంటి స్థలాలను ప్రతినిధి బృం దం పరిశీలించి మాట్లాడారు. ఇంటి స్థలాలు కేటాయించకుండా ఎమ్మెల్యే అడ్డుపడుతున్నారని కొందరు అసత్య ప్రచారం చేస్తూ రాజకీయ లబ్ధిపొం దేందుకు కుట్ర చేస్తున్నారని ఇది అవాస్తవమన్నారు. పట్టణ పేదలకు ఇంటి స్థలాలకు అనాదిగా పోరాడుతోంది, పోరాడేది కేవలం కమ్యూనిస్టు పార్టీనేనని, సీపీఐ పోరాట ఫలితంగానే పాత కొత్తగూడెంలో పేదలకు స్థలాలు సిద్ధం చేసి డ్రా పద్ధతిలో కేటాయించడం జరిగిందని, ఇందులో జరిగిన అవకతవకలపై నిజమైన లబ్ధిదారులకు స్థలం దక్కేలా కమ్యూనిస్టు పార్టీ కృషి చేస్తుందని అన్నారు. పేదల మనిషిగా పేరు సంపాదించుకున్న కూనంనేనిపై ఇలాంటి ఆరోపణలు చేయడం వారి విజ్ఞతకే వదిలి వేస్తున్నామని పేర్కొన్నారు. ఈ బృందంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు సలిగంటి శ్రీనివాస్, పట్టణ జాయింట్ సెక్రటరీ కంచర్ల జమలయ్య, జిల్లాసమితి సభ్యులు మునిగడప వెంకటేశ్వర్లు, భూక్య శ్రీనివాస్, మునిగడప పద్మ, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, కిలారి ప్రసాద్, పుట్టి భాగ్యలక్ష్మి, కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుగు జాతరకు సమ్మక్క ఆలయం ముస్తాబు


తిరుగు జాతరకు సిద్ధమైన ఆలయం

మణుగూరు, మార్చి 3: మేడారం జాతరం అనంతరం మణుగూరులోని ఆదివాసీ గిరిజన గ్రామమైన చినరాయగూడెం గ్రామంలో ఉన్న సమ్మక్క సారలమ్మ దేవాలయం తిరగు జాతరకు ముస్తాబు అయింది. ఈ నెల 5 నుంచి మూడు రోజుల పాటు ఈ జాతర మహోత్సవాన్ని స్థానిక గిరిజన కుటుంబాలే కాకుండా పక్కన ఉన్న మండలాల ఇలవేల్పుల పూజారులు కూడా పెద్ద సంఖ్యలో తరలి వస్తారని ఆలయ పూజారి కుంజా లక్ష్మి తెలిపారు. మణుగూరు మండల, మునిసిపాలిటీ ప్రజలు అంతా తిలకించేందుకు తరలి రావాలని ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు విజ్ఞప్తి చేశారు.